బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: చదువుకుంటూ ఆటపాటలతో సాగాల్సిన పిల్లల బాల్యాన్ని చిదిమేస్తున్న బాలకార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మేడ్చల్ జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఆపరేషన్ ముస్కాన్ – పది సమన్వయ సమావేశం గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి పిల్లల భద్రత వారి భరోసా పై వివిధ శాఖల అధికారులు హాజరు కాగా, ముఖ్య అతిథిగా జిల్లా సంక్షేమాధికారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. పిల్లలు బాల కార్మికులు ఎక్కడ పని చేసినా, వెట్టిచాకిరి, అక్రమ రవాణా, భిక్షాటన చేస్తున్న పిల్లలను గుర్తించి, వెంటనే 1098 కి తెలియజేయాలన్నారు. ఆపరేషన్ ముస్కాన్ పది లో భాగంగా అక్రమ రవాణాలో చిక్కుకున్న పిల్లలను రక్షించి పునరావాసం కల్పిస్తారన్నారు.. వివిధ కారణాల వల్ల వారి కుటుంబాల నుండి విడిపోయిన లేదా తప్పిపోయిన పిల్లలను గుర్తించడానికి 'దర్పణ్' అనే ఫేషియల్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌ను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ రాజారెడ్డి,సభ్యులు అర్చన, నాగ జయశ్రీ, రామ్మోహన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి టి రఘునాథ స్వామి పాల్గొన్నారు.

బాలకార్మికులకు విముక్తి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లో పని చేస్తున్న పలువురు బాల కార్మికులకు ముస్కాన్ టీం సభ్యులు గురువారం విముక్తి కలిగించి యజమానులపై కేసు నమోదు చేయించారు. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన మేరకు.. ఘట్‌కేసర్‌లోని ఎస్ఆర్ఎం మెకానికల్ ఎంటర్‌ప్రైజస్ షాప్‌లో మైనర్ బాలుడు (14) పని చేస్తున్నాడు. అలాగే శివారెడ్డిగూడలోని ఏ–1 యూపీవీసీ విండోస్ షాపులో మరో మైనర్ బాలుడు (13) హెల్పర్‌గా పని చేస్తున్నాడు. సమాచారం అందుకున్న ముస్కాన్ టీం సభ్యురాలు పద్మ, ఎన్జీఓ ఆపరేషన్ టీం ఇన్‌చార్జ్ ఎస్సై కొండలు బాలురికి పని నుంచి విముక్తి కల్పించారు. మెకానిక్ షాప్ యజమాని ద్వారకా నగర్‌కు చెందిన ఆఫీస్, విండోస్ షాప్ ఓనర్ మహమ్మద్ గురు ఫాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



తుమ్మ చెరువును పట్టించుకునేదెవరు ?



రంగు మారిన తుమ్మ చెరువు నీరు

దుర్వాసనతో కాలనీల వాసుల సతమతం

- డ్రైనేజీ నీరు చెరువులో కలవడంతో రంగు మారుతున్న నీరు
- కట్ట పైనుండి చెత్తవేస్తున్న ప్రజలు
- మందుబాబులకు అడ్డాగా చెరువు



తుమ్మ చెరువులో ప్రజలు వేసిన చెత్త

మేడ్చల్: పట్టణంలోని తుమ్మ చెరువులో వ్యర్థాలను, చెత్తను ఇష్టానుసారంగా పడేస్తుండటంతో తుమ్మ చెరువు కంపు కొడుతోంది. ఆర్టీసీ కాలనీ, వినాయక్ నగర్ కాలనీ పై భాగంలో సూర్యనగర్, మల్లికార్జున నగర్, రైల్వేస్టేషన్ కాలనీలు, మరో వైపు సాయి బాబా గుడి కాలనీలు, ఇందిరానగర్, తదితర కాలనీలకు సమీపంలో ఉన్న తుమ్మ చెరువు పట్టణ ప్రజల భూగర్భ నీరు అందించడంలో కీలక భూమిక భూమిక పోషిస్తున్న చెరువు. కాలనీల మధ్య ఉండటంతో అధికారులు, పాలకులు ఎన్ని ఆదేశాలు జారీ చేస్తున్నా ఎన్ని సార్లు శుభ్రం చేస్తున్నా కాలనీల వాసులు తమ ఇళ్ళ నుండి వచ్చే వ్యర్థాలను, చెత్తను తీసుకవచ్చి చెరువు అంచులలో పడేస్తుండటంతో చెరువు దుర్వాసన వెదజల్లుతోంది. చెత్త చెరువు అంచులలో నుండి నీటిలోకి చేరి నిల్వ ఉండటంతో దుర్గంధంతో పాటు దోమలు పెరుగుతున్నాయి. దీంతో కాలనీలలో చెరువు సమీపంలో ఉండే వారు ఇబ్బందులు పడుతున్నారు. సమీప కాలనీలలో దోమల బెడద ఎక్కువగా తయారయ్యింది. ఒక వైపు నుండి చెత్తచెదారం వేయడం,మరో వైపు నుండి మురికి నీరు తుమ్మ చెరువులోకి వదిలేయడంతో చెరువులో నీరు పూర్తిగా రంగు మారి కంపుమయంగా తయారైంది.

హెచ్చరికలను పట్టించుకోని ప్రజలు

కట్టపై, చెరువులో చెత్త వేయవద్దని వేస్తే రూ.500 జరిమానా విధిస్తామని మున్సిపల్ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా అవి బోర్డులకే పరిమితమయ్యాయి. అధికారులు భాధ్యత లేకుండా చెత్త వేస్తున్న వారిపై కోరడా ఝులిపించాల్సిన అవసర ఎంతైనా ఉండటంతో పాటు చెరువు లోకి మురుగు నీరు రాకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా పట్టణంలోని పలు దుకాణాల వారు తమ వ్యర్థాలను చెరువు నీటిలో వేస్తున్నారు. చెత్త వేయకుండా సీసీ కెమరాలు ఏర్పాటు చేసి ,జరిమానాలు విధిస్తే కొద్ది మేరకైన కంపు కంట్రోల్ అవుతుంది.

తాగుబోతులకు అడ్డాగా..

కాలనీలకు సమీపంలో తుమ్మ చెరువు ఉండటంతో కట్టపై కొంతమంది తాగుబోతులు అడ్డాగా చేసుకుని అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. కొంతమంది గంజాయి సేవిస్తూ మద్యం తాగుతూ అడ్డాగా మార్చుకున్నారు. కొంమతంది ఆటో వాలలు ఆటో లు పార్క్ చేసి అందులో కూర్చొని తాగుతున్నారు.

కలుషితం అవుతున్న భూగర్భ జలాలు..

పది కాలనీల వరకు భూగర్భ జలాలు అందించే తుమ్మ చెరువు మురికి నీటితో కలుషితం అవుతుండటంతో భూగర్భ జలాలు క్రమేపి కలుషితమవుతున్నాయి. చెరువు సమీపంలో ఉన్న బోర్లలో ఇప్పటికే నీరు రంగు మారి వస్తున్నాయి. పరిస్థితి చేజారకముందే చెరువును కలుషితం బారి నుండి కాపాడాల్సిన భాధ్యత మున్సిపల్ పాలకవర్గందే.

అభివృద్ధి చేసినా..

చెరువు కట్టను ఎమ్మెల్యే మల్లారెడ్డి గతంలో ఆయన మంత్రిగా ఉన్న సమయంలో తన జేబులో నుండి రూ.20లక్షలు వెచ్చించి సిమెంట్ రోడ్డు వేయించారు. కొద్ది మేరకు కట్టమైసమ్మ ఆలయం వరకు మున్సిపల్ తరుపున వీధి దీపాలు ఏర్పాటు చేశారు. సిమెంట్ రోడ్డు వేయడంతో కట్ట విశాలంగా మారింది. వాహనాల రాకపోకలు పెరిగాయి. జాతీయ రహదారి పైకి వెళ్ళకుండా పాత,కొత్త మేడ్చల్ అనుసంధానంగా కట్ట మారింది. కట్ట అందంగా తయారైనా దుర్వాసనతో ఆ ప్రాంతం కాలనీల వాసులకు ఉపయోగం లేకుండా పోయింది. ఉదయం ,సాయంత్రం పాద చారులు కాసేపు వాకింగ్ చేయడానికి వీలు లేకుండా తయారైంది.

నిధుల మంజూరు ఎప్పుడో...

తుమ్మ చెరువు లో డ్రైనేజీ నీరు కలవకుండా పై భాగంలో ఉన్న కాలనీల నుండి డ్రైనేజీ నిర్మించి హౌజింగ్ బోర్డు కాలనీ మీదుగా వెళ్ళె ప్రధాన డ్రైనేజీ లో కలపాలని ప్రతిపాదనలు సిద్ధం చేసి దాని కోసం దాదాపు రెండు కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేసి ప్రతిపాదనలు ప్రభుత్వంకు పంపినా నిధులు మాత్రం విడుదల కాలేదు. చెరువు నిండక ముందే అధికారులు చెరువులో డ్రైనేజీ నీరు కలవకుండా పనులు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మండల పరిషత్ కార్యాలయ సిబ్బందికి సన్మానం



మండల పరిషత్ సిబ్బందిని సన్మానిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీఓ గీత

ఘట్‌కేసర్: ఎంపీపీగా ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం సిబ్బందిని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా సిబ్బందిని శాలువాతో సన్మానించి నూతన వస్త్రాలు అందజేశారు. అనంతరం మండల పరిషత్ సిబ్బంది ఎంపీపీకి ఘనంగా వీడుకోలు పలికారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీత, ఏఈ వెంకట్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ కుమార్, షరీఫ్, రాములమ్మ, కుమార్, లక్ష్మీ, ఉమా, సత్యవతి, మధు, దినేశ్ పాల్గొన్నారు.

మండల పరిషత్ ప్రత్యేకాధికారిగా డిప్యూటీ కలెక్టర్



శామీర్‌పేట మండల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న డిప్యూటీ కలెక్టర్ సైదులు

శామీర్‌పేట్: శామీర్‌పేట మండల పరిషత్ ప్రత్యేకాధికారిగా మేడ్చల్ జిల్లా డిప్యూటీ కలెక్టర్ సైదులు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

మూడుచింతలపల్లి మండలానికి నీరజ...

మూడుచింతలపల్లి మండల పరిషత్ ప్రత్యేకాధికారిగా మేడ్చల్ డిప్యూటీ సీఈఓ నీరజ నియమితులయ్యారు. ఈ మేరకు మూడు చింతలపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు.

ఎప్పుడు కూలుతుందో....!

శిథిలావస్థలో ట్యాంకు...





తూంకుంట మున్సిపల్ కార్యాలయం ఎదుట శిథిలావస్థలో ట్యాంకు

శామీర్‌పేట్: వర్షాకాలం సమీపిస్తుండగానే శిథిలావస్థలో ఉన్న భవనాలు, ఇండ్లకు నోటీసులు ఇచ్చే అధికారులు పరిపాలన భవనానికి ఎదురుగా ఉన్నవాటిని మాత్రం పట్టించుకోవడం లేదు. తూంకుంట మున్సిపల్ కార్యాలయం ఎదుట శిథిలావస్థకు చేరి, ఇళ్ల మధ్య ఉన్న నీటి ట్యాంకును మాత్రం అలాగే వదిలేశారు. దీంతో ఎప్పుడు కూలుతుందోనని చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలు భయాందోళనల నడుమ జీవిస్తున్నారు.

మోసం చేసి డబ్బు కాజేసిన వారికి రెండేళ్ల జైలు

మేడ్చల్: కార్మికురాలు మరణించినా ఆమె పేరున బ్యాంకులో నకిలీ ఖాతా తెరిచి ఆమె కుటుంబానికి రావాల్సిన సొమ్మును కాజేసిన ఇద్దరు వ్యక్తులకు మేడ్చల్ న్యాయస్థానం రెండేళ్ళ జైలు శిక్ష వెయ్యి రూపాయల జరిమాన విధించింది. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజయ్‌కుమార్ తెలిపిన మేరకు.. మేడ్చల్ జుడిషియల్ పరిధిలోని పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జీడిమెట్లలో నివసముండే కమల ప్రైవేటు కంపెనీలో పనిచేస్తూ 2017లో మరణించింది. జీడీమెట్లకు చెందిన ఇక్కుర్తి శ్రీనివాస్ రావు(46) గాజులరామారానికి చెందిన పిన్నోజు సత్యనారయణ(52)లు చనిపోయిన కమల పేరిట బ్యాంకులో ఖాతా తెరిచి ఆమెకు కంపెనీ నుండి రావాల్సిన రెండున్నరలక్షల రూపాయలు ఆఖాతాలో జమచేయించారు. ఖాతాలో జమైన సొమ్మును ఏటీఎం కార్డుల ద్వారా డ్రా చేసుకున్నారు. ఫిర్యాదు అందుకున్న పేట బషీరాబాద్ పోలీసులు దర్యాప్తు చేసి నిందితులను మేడ్చల్ 9వ ఎఎంఎం కోర్టులో హాజరుపరచగా వాదోపవాదాలు విన్న న్యాయమూర్తి దీపీప్ నాయక్ ఇద్దరు నిందితులకు రెండెళ్ళ జైలు శిక్ష వెయ్యి రూపాయల జరిమాన విధిస్తూ తీర్పు వెల్లడించారు.

మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్



కీసర: ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్‌కి బాత్‌లో ఇచ్చిన పిలుపు మేరకు తన తల్లిజ్ఞానపకార్థం నాగారం మున్సిపల్ ఛైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులోని రేణుక ఎల్లమ్మకాలనీలో మొక్కలను నాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలను నాటాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, నేతలు రవీందర్‌రెడ్డి, నక్కకి షేర్‌గౌడ్, పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

మేడ్చల్ రూరల్: అల్లూరి సీతారామరాజు జయంతి, వివేకానంద, దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా గుండ్లపోచంపల్లిలో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. గుండ్లపోచంపల్లితో పాటు మున్సిపల్ పరిధిలోని సుతారిగూడ, కండ్లకోయ, అర్కల్‌గూడ లో స్థానిక కౌన్సిలర్లతో కలిసి బీజేపీ శ్రేణులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వినర్ మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో స్థానికులతో కలిసి పర్యటించారు. మల్లికార్జుననగర్, మార్కండేయ టెంపుల్ వీధి, బాలేందర్ షాపు తదితర ప్రాంతాల్లో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీవరేజ్ పైపులైన్ పనులు, తాగునీటి పైపులైన్ పనులను పరిశీలించి, పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. బన్నాల ప్రవీణ్, ఎదుల కొండల్‌రెడ్డి, అశోక్‌చారి, నర్సింగ్ నేత తదితరులున్నారు.

యువతి అదృశ్యం

ఘట్‌కేసర్: పని కోసం వెళ్లిన ఓ యువతి అదృశ్యమైంది. ఈ సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన మేరకు.. చత్తిస్‌గఢ్ కు చందిన ముఖేశ్వరీ (19) అవుషాపూర్ కేపాల్ ఆస్పత్రి వద్ద కుటుంబంతో కలిసినివాసముంటోంది. బుధవారం ఉదయం ముఖేశ్వరీ పని కోసం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆమె ఫోన్ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచాఫ్ వస్తుంది. బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా అచూకి లభించకపోవడంతో కుటుంబసభ్యులు ఘట్‌కేసర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

నేటి మహాధర్నాను విజయవంతం చేయాలి

జవహర్‌నగర్: వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పెంచిన పెన్షన్ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వికలాంగుల హక్కుల సమితి అధ్యక్షులు వినయ్ డిమాండ్‌చేశారు. ఈ నెల 5వ తేదీన మేడ్చల్ కలెక్టరేట్ వద్ద నిర్వహించే మహాధర్నాని విజయవంతం చేయాలని గురువారం కోరారు. కార్యక్రమంలో శ్రీను, కృష్ణనాయక్, రోజారాణి, సుగు ణ, నర్సింహా, చంద్రయ్య, శ్రీశైలం, సావిత్రి, పవన్, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద వర్ధంతి



ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో స్వామి వివేకానంద వర్ధంతిని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కావేరితో కలిసి హాజరై స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నరేశ్, మశ్చేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



కీసర: విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుల్లో రాణించగలగుతారని కీసర మండల వైద్యాధికారిడాక్టర్ సరితారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామంలోగల బాలికల జ్యోతి బాపూలేపాఠశాలను సందర్శించి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల్లో చదువుకుంటున్న 900 మంది విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి



మేడ్చల్ లో నివాళులు అర్పిస్తున్న నేతలు



మేడ్చల్: తెలంగాణ విముక్తి కోసం పోరాటం చేసి తొలిఅమరుడైన దొడ్డి కొమురయ్య వర్ధంతిని మేడ్చల్‌లో కురమసంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు, ఆధ్వర్యంలో మేడ్చల్‌లో నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కొమురయ్య చిత్ర పటం ఏర్పాటు చేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి కౌన్సిలర్‌లు కొడె మహేష్, స్వామియాదవ్, శివకుమార్ యాదవ్ ,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ రూరల్: దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ మద్దుల లక్ష్మి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నివాళులు అర్పించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జవహర్‌నగర్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో దొడ్డి కొమురయ్య తెగువ మరువలేనిదని కేవైసీఎస్ రాష్ట్ర కార్యదర్శి మంగ యాకయ్య అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్మికనగర్‌లో గురువారం కేవైసీఎస్ రాష్ట్ర కార్యదర్శి మంగ యాకయ్య ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతిని నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మహేందర్, శ్రీను, రాజు, కమలాకర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

వివేకానందుని జీవితం యువతకు సందేశం



కుషాయిగూడలో నివాళులర్పించిన మాజీ కార్పొరేటర్ ధన్‌పాల్‌రెడ్డి



వివేకానందుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కుషాయిగూడ: కుషాయిగూడలో వివేకానంద 122వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన యువతకు ఇచ్చిన సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక నేతలు చక్రపాణిగౌడ్, ఆనంద్‌గౌడ్, చల్లా ప్రభాకర్, పంజాల బాబుగౌడ్, చిత్తుల కిషోర్, చల్లా వెంకటేశం, వెంకులు, దయానంద్, జనార్ధన్, నర్సింగ్‌రావు తదితరులున్నారు.

మల్కాజిగిరి: స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా మల్కాజిగిరి ఆనంద్‌బాగ్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి బీజేపీ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, నియోజకవర్గ కన్వీనర్ డీఎస్ వెంకటేష్, నాయకులు రామకృష్ణ, శ్రీనివాస్, నవీన్, కిరణ్, మంగేష్ తదితరులున్నారు.

భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటాడు..

గౌతంనగర్: భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మహాపురుషుడు స్వామి వివేకానంద అని వివేకానంద రైసింగ్ సొసైటీ అధ్యక్షుడు కుమ్మరి రాజు అన్నారు. వివేకానంద రైసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం గౌతంనగర్‌లో స్వామి వివేకానంద వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నితిన్‌కుమార్, అఖిల్, వినయ్, ప్రశాంత్, లలిత, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గది పనులకు శంకుస్థాపన



అవుషాపూర్‌లో పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: అవుషాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 15వ ఆర్థిక సంఘం, ఎస్ఎఫ్‌సీ నిధులు రూ. 11.15 లక్షలతో నిర్మిస్తున్న అదనపు తరగతి గది పనులు గురువారం శంకుస్థాపన చేశారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి హాజరై పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈ వెంకట్‌రెడ్డి, మశ్చేందర్ రెడ్డి, భానుయాదవ్, సాయిలు, సల్మాన్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్ పర్సన్, కౌన్సిలర్

మేడ్చల్: పట్టణంలోని 13వ వార్డులో రూ.25 లక్షల మున్సిపల్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహా రెడ్డి ప్రారంభించారు. కౌన్సిలర్ మర్రి శ్రీనివాస్‌రెడ్డి తో కలిసి ఆమె నిర్మాణ పనులకు పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులను ప్రారంభించారు. పట్టణంలోని అన్ని కాలనీలలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేముల శ్రీనివాస్‌రెడ్డి ,సత్యనారయణ, నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ ప్రశాంతం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



ఘట్‌కేసర్‌లో నిరసన తెలుపుతున్న సంతోష్ శివాజీనాయక్ ఇతర విద్యార్థులు

ఘట్‌కేసర్: నీట్ పరీక్ష రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం చేపట్టిన దేశవ్యాప్త బంద్ ఘట్‌కేసర్‌లో ప్రశాంతగా ముగిసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోశ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి శివాజీనాయక్ ఆధ్వర్యంలో విద్యాసంస్థలను మూసివేయించారు. అనంతరం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జీతో విచారణ జరిపించాలని, లీకులకు కారణమైన ఎన్‌టీఏ సంస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అనిల్, మనోజ్, శ్రీను, శ్రీకాంత్, ప్రసాద్, కార్తీక్, వినోద్‌నాయక్, చింటు, దేవేందర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

మేడ్చల్: నీట్ పరీక్ష తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు చేపట్టిన విద్యాసంస్థల దేశ వ్యాప్త బంద్ మేడ్చల్‌లో ప్రశాంతంగా ముగిసింది. కేజీ టు పీజీ కళాశాలలు అన్ని బంద్ సంధర్బంగా మూతపడ్డాయి. ఎస్ఎఫ్ఐ,ఎన్ఎస్‌యూఐ తదితర విద్యార్థి సంఘాల నాయకులు బంద్ సందర్భంగా పలు కళాశాలలను బంద్ చేయించారు.

మేడ్చల్: విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న విద్యార్థి సంఘాల నేతల అక్రమ అరెస్టులను వెంటనే అపాలని మేడ్చల్ ఎస్ఎఫ్ఐ కార్యదర్శి కిరణ అన్నారు. బంద్ సందర్భంగా కళాశాల విద్యార్థులతో ఎస్ఎఫ్ఐ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడ్చల్‌లో బంద్ విజయవంతం అయ్యిందని కేంద్ర విద్యా శాఖా మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి

కుషాయిగూడ: మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను మీర్‌పేట్–హెచ్‌బీ కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్లు ప్రభుదాస్, పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరై అల్లూరి విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బ్రిటిష్ సామ్రాజ్యానికి ఎదురొడ్డి నిలిచిన పోరాట యోధుడు అల్లూరి అని కొనియాడారు. మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, మునిగంటి రామ్‌ప్రదీప్, కాసం మహిపాల్‌రెడ్డి, గడియారం రామకృష్ణ, శేఖర్‌గౌడ్, వసంతరావు తదితరులున్నారు.



నివాళులర్పించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్, కార్పొరేటర్లు

ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలి



ట్రక్ పార్క్ ఏరియాలో మొక్కలు నాటుతున్న ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

మల్లాపూర్: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. జన్‌సంఘ వ్యవస్థాపకుడు దివంగత డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి నుంచి జయంతి వరకు వారం రోజుల పాటు నిర్వహిస్తున్న సందర్భంగా గురువారం నాచారం ట్రక్ పార్క్ అసోసియేషన్ ఆవరణలో ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మొక్కలు నాటారు. అసోసియేషన్ అధ్యక్షుడు పాతగాని గోపాల్‌గౌడ్, లక్ష్మారెడ్డి, అశోక్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, నర్సింహాగౌడ్, చంద్రమౌళి, ట్రక్ ఓనర్స్, డ్రైవర్లు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.